యువతి అదృశ్యం


ప్రేమలత (పాతచిత్రం)

బెజ్జూరు, న్యూస్‌టుడే: బెజ్జూరు మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన సడ్మేక ప్రేమలత(28) అనే యువతి అదృశ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ రాంసింగ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న పని ఉందని ఇంట్లో చెప్పి సడ్మేక ప్రేమలత సిర్పూర్‌కు వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో వారి బంధువుల ఇండ్లలో కుటుంబీకులు వెదికినా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రేమలత తండ్రి సడ్మేక భీమయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాంసింగ్ తెలిపారు.

బాలిక అపహరణ: ఇద్దరిపై కేసు

మామడ: మామడ నుంచి బాలికను కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లేష్ తెలిపారు. మామడకు చెందిన జాకీర్ అనే వ్యక్తి బాలికను కారులో ఎక్కించుకొని ఖానాపూర్ తీసికెళ్లాడని అతనికి అఫ్రోజ్ అనే మరో యువకుడు సహకరించారని ఎస్సై చెప్పారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఆ ఇద్దరినీ త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి మృతి

తాండూరు, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని ఓ యువకుడు ఇంట్లోని పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన కన్నెపల్లి మండలం వీగాంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. వీగాంకు చెందిన కారెం అంజయ్య (18) అనే యువకుడు బుధవారం పురుగుల మందు తాగి మృతి చెందాడు. మొదటి నుంచి మానసికస్థితి సరిగా లేని అంజయ్య బుధవారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగుల మందు డబ్బా తెరచి అవగాహన లేక అందులోని రసాయనాన్ని తాగాడు. విషయం గమనించిన అతని తల్లిదండ్రులు వెంటనే ఆసుపత్రి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.


మృతి చెందిన అంజయ్య

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగల మరమ్మతులు చేపడ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన పోశెట్టి అనే వ్యక్తి విద్యుత్తు శాఖలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ప్రియదర్శినినగర్ కాలనీలో విద్యుత్తు మరమ్మతులు చేపడ్తుండగా 11 కేవీ విద్యుత్తుతీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ప్రాంతీయాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.

అధికారి వాహనం చోరీ

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: జిల్లా సచివాలయంగా పిలిచే పాలనాప్రాంగణంలో వాహనాలకు భద్రత కరవవుతోంది. బుధవారం పౌరసంబంధాలశాఖ అధికారి భీంకుమార్ ద్విచక్ర వాహనం చోరీకి గురికావడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. విధుల్లో భాగంగా ఉదయం పాలనాప్రాంగణంలోని తమ కార్యాలయానికి చేరుకున్న భీంకుమార్ ద్విచక్రవాహనాన్ని రోజూ మాదిరిగానే ఆవరణలో నిలిపి ఉంచారు. తిరిగి వెళ్లేసమయంలో ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో చోరీ విషయం బయటపడింది. ఇదివరకు ప్రజావాణి విభాగానికి వచ్చిన వ్యవసాయాధికారి వాహనం, అటెండరు నజీర్ సైకిల్ సైతం చోరీకి గురైంది. పాలనాప్రాంగణంలో నిలిపి ఉంచిన వాహనాలకే రక్షణ లేనపుడు.. బయట పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఉరేసుకొని వంచనకు గురైన బాలిక ఆత్మహత్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: తాత్కాలికంగా సంరక్షణ గృహంలో ఉన్న ఓ బాలిక మనస్థాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా భైంసా మండలం, గుండేగావ్‌కు చెందిన బాలిక(15) స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమెను ఓ యువకుడు ప్రేమ పేరుతో వంచించాడు. బాలిక తల్లిదండ్రులు భైంసా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 376 సెక్షన్ కింద యువకుడిపై కేసు నమోదు చేశారు. బాలిక తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లనని చెప్పడంతో పునరావాస కేంద్రానికి తరలించాలని కోర్టు సూచించింది. ఆల్విన్ కాలనీలోని ప్రభుత్వ సంరక్షణ గృహానికి ఇటీవల పోలీసులు తీసుకొచ్చారు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె బుధవారం తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సుసైడ్ నోట్‌లో ప్రేమించిన యువకుడి తల్లిదండ్రుల వేధింపుల కారణంగా చనిపోతున్నట్లు రాసి ఉంది. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణహితలో ఇద్దరి గల్లంతు

సిరోంచా సమీపంలో ఘటన


ఆలం తిరుపతి (పాతచిత్రం)


యువకుడి కోసం గాలింపు చేపడుతున్న పోలీసులు, గజ ఈతగాళ్లు

కోటపల్లి, న్యూస్‌టుడే: జిల్లాకు సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరొల్లి జిల్లా సిర్వాంచ సమీపంలోని ప్రాణహిత నదిలో బుధవారం ఇద్దరు చిన్నారులు గల్లంతైన సంఘటన తెలుగు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లికి చెందిన తిరుపతి, భూపాలపల్లికు చెందిన సారయ్యల కుటుంబాలు సిరోంచాలో తాత్కాలిక నివాసం ఏర్పరచుకొని వీధుల్లో తిరుగుతూ చిరువ్యాపారం చేసుకుంటున్నారు. ఈక్రమంలో తల్లిదండ్రులు వ్యాపారనిమిత్తం బయటికి వెళ్లగా తిరుపతి కుమార్తెలు స్వప్న (11), స్వరూప, సారయ్య కూతురు వెంకటరమణ (12)లు దుస్తులు ఉతకడం కోసం ప్రాణహిత నదికి వెళ్లారు. పనులు ముగించుకున్న అనంతరం స్వప్న, వెంకటరమణ నీటిలోకి దిగడంతోనే గల్లంతయ్యారు. వారిని కాపాడేందుకు ఒడ్డున ఉన్న స్వరూప ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. వెంటనే కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించడంతో గడ్చిరొల్లి డీఎస్పీ గజానంద్‌రాథోడ్ ఆధ్వర్యంలో అక్కడి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా గల్లంతైన వారి ఆచూకీ లభ్యం కాలేదు.


నదివద్ద రోదిస్తున్న తిరుపతి కుటుంబ సభ్యులు

చెన్నూరు గోదావరిలో యువకుడు

చెన్నూరు: చెన్నూరు పట్టణ సమీపంలోని పంచక్రోశ ఉత్తర వాహిణి గోదావరి నదిలో బుధవారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. భీమారం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆలం తిరుపతి(18) అనే యువకుడు తన తల్లితండ్రులు, బంధుమిత్రులతో కలిసి స్థానిక గోదావరి నదికి పుణ్యస్నానం ఆచరించేందుకు వచ్చాడు. శ్రావణ మాసం అయినందున కుటుంబసభ్యులంతా కలిసి గోదావరి నదిలో పుణ్యసాన్నాలు చేసేందుకు ఇక్కడికి వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి నదిలో స్నానాలు చేస్తున్న తిరుపతి నదిలో కొంత లోపలికి వెళ్లి స్నానం చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో తిరుపతి అకస్మాత్తుగా నీటిలో మునిగి కొట్టుకుపోయాడు. విషయాన్ని గమనించిన అతడి కుటుంబసభ్యులు తిరుపతిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. తిరుపతి నీళ్లల్లో కొట్టుకుపోతున్న విషయాన్ని కళ్లారా చూస్తూ ఏమీ చేయలేని పరిస్థితిలో వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొన్నారు. నదిలో గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గజ ఈతగాళ్లు, పోలీసులు నది వద్దే ఉండి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

దుబాయ్‌లో మల్లాపూర్ వాసి మృతి

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: ఉపాధికోసం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతూ మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన ఉడ్త పోసులు(59) మరణించారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోసులు ఎనిమిదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌కు వెళ్లాడు. అక్కడి కంపెనీలో పని చేస్తూనే జీతం సరిపోక కంపెనీ నుంచి వెళ్లి పోయి(కల్లివిల్లి) ఇతర చోట పనులు చేసుకుంటూ ఉన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావటంతో స్వదేశానికి వచ్చేందుకు తాత్కాలిక పాస్‌పోర్టును సైతం తీసుకున్నారు. రెండు రోజుల క్రితం అనారోగ్యం తీవ్రమవటంతో అక్కడే మరణించాడు. అక్కడున్న తెలుగువారు ఇక్కడి కుటుంబ సభ్యులకు చరవాణి ద్వారా సమాచారం చేరవేశాడు. పోసులు మృతిచెందాడన్న వార్త తెలుసుకొని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహం త్వరగా వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


ఉడ్త పోసులు (పాచిత్రం)

మలేషియాలో సోన్ వాసి మృతి

నెల రోజుల్లో కుమార్తె పెళ్లి.. ✤ మృతదేహాన్ని రప్పించాలని వేడుకోలు

సోన్, న్యూస్‌టుడే: నెల రోజుల్లో పెళ్లి. నాన్న నా పెళ్లికి తప్పకుండా రావాలి అన్న కుమార్తెకు సరే తప్పకుండా వస్తాను అని పది రోజుల క్రితం మలేషియా నుంచి ఫోన్‌లో చెప్పిన తండ్రి రెండు రోజుల క్రితం అనంతలోకాలకు చేరుకున్నాడు. పెళ్లి శుభకార్యం పనుల్లో నిమగ్నమైన ఆ కుటుంబ సభ్యులకు పిడుగు లాంటి ఈ వార్త తెలియగానే కన్నీరు మున్నీరవుతున్నారు. వివరాలిలా.. బతుకుదెరువు కోసం సోన్ మండలం బొప్పారం నుంచి శివరాత్రి ఎర్రన్న (48) ఏడు నెలల క్రితం మలేషియాకు వెళ్లాడు. విజిట్ వీసాపై వెళ్లి పనులు చేసుకుంటుండగా అక్కడ పరిచయాలు ఏర్పడటంతో నిర్మల్ ప్రాంతానికి చెందిన వ్యక్తితో కలిసి రూం వసతి ఏర్పాటు చేసుకున్నాడు. కలిసి మెలసి ఉన్న వీరు చిన్న విషయంలో ఘర్షణ పడ్డారు. ఎర్రన్నకు బలమైన గాయాలు తగలడంతో అక్కడి మిత్రులు ఆస్పత్రిలో చేర్చారు. వైద్యం అందుతున్న క్రమంలోనే సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో ఆ ఇంట్లో విషదఛాయలు అలముకున్నాయి. విషయం తెలిసిన బంధుమిత్రులు ఇంటి వద్దకు చేరుకొని శవం ఎప్పుడు వస్తుందో నని ఎదురు చూస్తున్నారు. జిల్లా నాయకులు, అధికారులు స్పందించి నా భర్త శవాన్ని తెప్పించండంటూ ఎర్రన్న భార్య శివరాత్రి ఎల్లవ్వ వేడుకుంటోంది. కుటుంబాన్ని పోషించడానికి మలేషియాకు వెళ్లాడని, మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని వారికి మంచి సంబందాలు చూసి పెళ్లిల్లు చేసేంతవరకు విదేశాల్లోనే ఉండి వస్తానని చెప్పి వెళ్లిన భర్త ఇలా మమ్మల్ని వదిలి పెట్టి అనంత లోకాలకు వెళ్లి పోయాడని రోదిస్తోంది. ఈ విషయం తెలిసిన బంధువులు ఇంటి వద్దకు వచ్చి శవం కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక నాయకలు అధికారులు స్పందించి శవాన్ని ఇండియాకు రప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.


ఎర్రన్న (పాతచిత్రం)


రోదిస్తున్న ఎర్రన్న భార్య ఎల్లవ్వ


బొప్పారంలో ఎర్రన్న ఇంటి వద్ద బంధువులు

చొక్కాలలో.. పక్కాగా!

120 దేశీదారు సీసాలు పట్టివేత ✦ దాచుకునేందుకు ప్రత్యేక దుస్తులు


ఆదిలాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పైనుంచి చూస్తే ఎలాంటి అనుమానం రాకుండా, లోపల సీసాలు దాచుకునేందుకుప్రత్యేక చొక్కాలు కుట్టించుకున్నారు. ఒకటికాదు, రెండుకాదు.. ఏకంగా ఒక్కోచొక్కాకు పదుల సంఖ్యలో జేబులు కుట్టుంచుకొని వాటిలో 120 దేశీదారు సీసాలు రవాణా చేస్తూ ఆబ్కారీ అధికారుల తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయారు. ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మి వాడకు చెందిన ఇద్దరు యువకులు దేశీదారు సీసాలు తరలిస్తూ బుధవారం పట్టుబడ్డారు. ఆబ్కారీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి దేశీదారును జిల్లాకు తీసుకొచ్చి అక్రమ దందా చేయడాన్ని ఒంట పట్టించుకున్న చందు, మునిరాం అందుకోసం ప్రత్యేక ఏర్పాటు చేసుకున్నారు. లెక్కకు మించిన జేబులతో చొక్కాలు కుట్టించుకొని వాటిలో దేశీదారు దిగుమతి చేస్తున్నారు. బుధవారం జిల్లా ఆబ్కారీ అధికారులకు అందిన సమాచారం మేరకు సీఐ లక్ష్మణ్‌రావ్, సిబ్బంది ఇంతియాజ్, రషీద్ ఖాన్, జమీర్, క్రిష్ణ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపడుతున్నారు. అప్పుడే మహారాష్ట్ర నుంచి వచ్చి రైలు దిగిన చందు, మునిరాంలపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా, చొక్కా లోపలి భాగంలో దేశీదారు సీసాలు దొరికాయి. 180 ఎంఎల్ సీసాలు 120 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.


పట్టుబడ్డ సీసాలతో పర్యవేక్షకుడు, ఇతర సిబ్బంది


సీసాలు దాచుకునేందుకు ప్రత్యేకంగా కుట్టించుకున్న చొక్కాలో దేశీదారు

పంచాయతీలుగా మారాలి.. సమస్యలు తీరాలి

- ఎన్నికల హామీపై దృష్టి సారించిన రాష్ట్ర సర్కారు
- జిల్లాలో 39 పంచాయతీల ఏర్పాటుకు అధికారుల ప్రతిపాదనలు
- ప్రభుత్వ ప్రకటనతో చిగురించిన ఆశలు


కుభీరు మండలంలోని రంజని తండా

లోకేశ్వరం, న్యూస్‌టుడే:

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా తండాలను పంచాయతీలుగా మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. నవంబరులోగా రాష్ట్రంలోని 500 జనాభా దాటిన 1,750 తండాలను పంచాయతీలుగా మార్చేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఈ ఏడాది అంతానికి తండాలను పంచాయతీలుగా మార్చి 2018 జులై నెలలో నిర్వహించే ఎన్నికలలో పాలకవర్గాలను ఎన్నుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. దీంతో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక అనుబంధ గ్రామాలుగా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న తండావాసుల ఆశలు ఈ ప్రకటనతో చిగురించాయి. నిర్మల్ జిల్లాలో పంచాయతీలుగా మారనున్న తండాలు, వాటిలో రాజ్యమేలుతున్న సమస్యలపై 'న్యూస్‌టుడే' కథనం

జిల్లాలో 39 తండాలకు పంచాయతీ హోదా

నిర్మల్ జిల్లాలోని 19 మండలాలలో ప్రస్తుతం 240 పంచాయతీలున్నాయి. ఇపుడు 39 తండాలను పంచాయతీలుగా మార్చేందుకు అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారు. వీటి ఏర్పాటు పూర్తయితే జిల్లాలో పంచాయతీల సంఖ్య 279కి చేరుతుంది. 500 జనాభా దాటి పంచాయతీకి కనీసం 3 కి.మీ. దూరంలో ఉన్న తండాలను పంచాయతీలుగా మార్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. పంచాయతీగా మార్చాలంటే తండాలోని జనాభాలో కనీసం 40 శాతం ఎస్టీలు ఉండాలి. ఒకవేళ పంచాయతీ పరిధిలో రెండుకి మించి తండాలుంటే వాటి జనాభా ఆధారంగా పంచాయతీ హోదా కల్పిస్తారు. లోకేశ్వర మండలంలోని పుస్పూర్ పరిధిలో ఐదు తండాలున్నా వీటి జనాభా ప్రకారం ముందుగా స్థిరపడ్డ రాజేశ్‌తండాను పంచాయతీగా మార్చేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

తొలగనున్న కష్టాలు.. దక్కనున్న పదవులు

తండాలను పంచాయతీలుగా మార్చలన్న ప్రభుత్వం నిర్ణయంతో తండావాసుల కష్టాలు తొలగిపోనుండడంతో పాటు ఆ తండా వాసులకు సర్పంచి, వార్డు సభ్యుల రూపంలో రాజకీయ పదవులు సైతం దక్కే అవకాశాలున్నాయి. పంచాయతీలకు వచ్చే అరకొర నిధులతో అనుబంధ గ్రామాలలోని సమస్యలపై సంబందిత పంచాయతీ ప్రజాప్రతినిధులు పెద్దగా దృష్టి పెట్టేవారు కాదు. దీంతో తండాలలో మౌలిక వసతులు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారు. ధృవీకరణ పత్రాలు, రేషన్ బియ్యం, పింఛను ఇలా ఏది కావాలన్నా పంచాయతీకి వెళ్లి రోజంతా కష్టపడితే గాని చేతికి అందేవి కావు. ఇపుడు ప్రభుత్వ నిర్ణయంతో వారి బాదలకు చెల్లుపడే అవకాశాలున్నాయి. త్వరలో పంచాయతీలుగా మారే కొన్ని తండాలలోని సమస్యలను పరిశీలిస్తే..

దశాబ్ద కాలం నుంచి అభివృద్ధిని ఎరగని లక్ష్మీనగర్‌తండా

లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ పంచాయతీ పరిధిలో రాజేశ్‌తండా, నర్సింహనగర్‌తండా, సేవాలాల్‌తండా, లక్ష్మీనగర్‌తండా, దుర్గానగర్ తండాలుంటాయి. దాదాపు 500 జనాభా కలిగిన లక్ష్మీనగర్ తండా దశాబ్ద కాలం నుంచి అభివృద్ధి విషయంలో ఒక్క పని కూడా జరగలేదని చెప్పుకోవచ్చు. ఈ పంచాయతీ పెద్దది కావడం, నిధులు అంతంత మాత్రంగానే అందుతుండడంతో వచ్చిన నిధులతో స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు పంచాయతీ లోనే పనులు చేపడుతుండడంతో ఈ తండా మౌలిక వసతులకు నోచుకోలేకపోయింది. తండా మొత్తానికి ఒకటే బోరు ఉంది. అందరూ దాని నుంచే నీటిని తీసుకోవాలి. తండాలో ఎప్పుడో వేసిన సిమెంటు రహదారి పూర్తిగా దెబ్బతింది. అంతర్గత రహదారులు, మురుగు కాలువలు లేవు. దీంతో తండాలోని ఖాళీ స్థలాలలో పొదలు పెరిగిపోయాయి. ఇపుడు ఈ పంచాయతీలో రాజేశ్‌తండాను పంచాయతీగా మారిస్తే ఆ పంచాయతీకి వచ్చే నిధులతో ఐదు తండాలలో కనీసం ఏడాదికి ఒక్క సమస్యయినా తీరుతుందని వారు ఆశతో ఉన్నారు.


లోకేశ్వరం మండలంలోని సేవాలాల్‌తండా

రంజనీ తండాలో అన్నీ సమస్యలే...

కుభీరు మండలంలోని రంజనీ పంచాయతీ పరిధిలో గల రంజనీతండాలో సమస్యలే రాజ్యమేలుతున్నాయని చెప్పవచ్చు. ఇక్కడ దాదాపు వేయి జనాభా ఉండి 590 మంది ఓటర్లుంటారు. తండాలో అంతర్గతంగా సీసీ రహదారులు లేవు.. మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. కనీసం కల్వర్టుల నిర్మాణం కూడా లేకపోవడంతో మురుగు నీరు అంతర్గత రహదారులపైనే పారే పరిస్థితి. గ్రామంలో రక్షిత మంచి నీటి ట్యాంకు ఉన్నా పైపులైను లేకపోవడంతో నీటి కోసం కాస్త ఇబ్బందులే ఉన్నాయి.

పంచాయతీలుగా మారనున్న తండాలు మండలం, పంచాయతీల వారీగా..

✦ జిల్లాలోనే ఎక్కువగా సారంగపూర్ మండలంలో 8 తండాలు పంచాయతీలుగా మారే అవకాశాలున్నాయి. ఇందులో స్వర్ణ పంచాయతీ పరిధిలోని లింగాపూర్, చించోలి(బి) పంచాయతీలోగల రాణాపూర్, దని పంచాయతీలోగల సాయినగర్‌తండా, పొట్యా పంచాయతీ పరిధిలోగల తాంసి తండా, ఇప్పచెల్మ, జాం పంచాయతీలో గల హనుమాన్‌తండా, గోపాల్‌పేట్ పంచాయతీలోని సోనాపూర్‌తండా, సారంగపూర్‌లో గల రవీంద్రనగర్, నాగాపూర్‌తండాలు

✦ కుభీరు మండలంలో చూస్తే రంజనీ పంచాయతీలో రంజనితండా, సిర్పెల్లి పంచాయతీలోని పకీర్‌నాయక్‌తండా, పెంటూనాయక్‌తండా, డోడర్న పంచాయతీలో రాంనాయక్ తండా, కృష్ణనాయక్‌తండా, చాతలోని రంగశివునితండా, మర్లగొండలోని బ్రహ్మేశ్వర్‌తండాలు

✦ లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ పంచాయతీ పరిధిలోగల రాజేశ్‌తండా

✦ కుంటాల మండలంలో సూర్యాపూర్ పంచాయతీలో గల అంబుగాం

✦ తానూర్ మండలంలో మొగ్గి పంచాయతీలోని మసల్గ తండా, హిప్నెల్లి పంచాయతీలోని హిప్నెల్లి తండాలు

✦ ముథోల్ మండలంలో ఎడ్‌బిడ్ పంచాయతీలోని ఎడ్‌బిడ్ తండా, విఠోలి పంచాయతీలోని విఠోలి తండా, చింతకుంట పంచాయతీలోని చింతకుంట తండాలు

✦ మామడ మండలంలో మామడ పంచాయతీలోని లింగాపూర్, గాయిద్‌పెల్లి పంచాయతీలోని రాసిమెట్ల తండాలు

✦ నర్సాపూర్(జి) మండలంలో కుస్లి పంచాయతీలోని అంజనితండా, గొల్లమాడ పంచాయతీలోని బూర్గుపెల్లి తండాలు

✦ దిలావర్‌పూర్ మండలంలో కాల్వ పంచాయతీలో కాల్వ తండా

✦ కడెం మండలంలో గంగాపూర్ పంచాయతీలో మొర్రిపేట్

✦ దస్తూరాబాద్ మండలంలో మున్యాల పంచాయతీలో గల లంబడితండా

✦ ఖానాపూర్ మండలంలో ఎర్వచింతల్ పంచాయతీలోని చామన్‌పెల్లి, రాజురా పంచాయతీలోని బావాపూర్(ఆర్)

✦ పెంబి మండలంలో పెంబి పంచాయతీలోని కొత్తగూడెం, వెంకంపోచంపాడ్ పంచాయతీలోని పోచంపాడ్, అంకెన, ఇటిక్యాల్ పంచాయతీలోగల కృష్ణనాయక్‌తండా, షెట్‌పెల్లి పంచాయతీలోని యాపల్‌గూడ, పస్పుల పంచాయతీలోని పుల్గం పాండ్రి, తాటిగూడలు.

అంబుగాంలో రహదారులపైనే మురుగునీరు

కుంటాల మండలంలోని సూర్యాపూర్ పంచాయతీ పరిధిలోగల అంబుగాంలో 782 మంది జనాభా ఉంటారు. ఇక్కడ అంతర్గత సిసి రహదారులు, మురుగు కాలువల నిర్మాణం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఏ మాత్రం వర్షం కురిసినా రహదారులన్నీ బురదమయంగా మారి నడవడానికి కూడా వీలులేకుండా తయారవుతాయని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కొత్త కాలనీలో విద్యుత్ లైనులు సరిగా లేక రాత్రిళ్లు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో ఎక్కడ విద్యుత్ సమస్య ఉన్నా నేరుగా కుంటాలలోని విద్యుత్ కేంద్రం నుంచి సరఫరాను నిలిపివేయాల్సి వస్తుంది.


శిథిలావస్థకు చేరిన అంబుగాం ప్రాథమిక పాఠశాల భవనం

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: నిర్మల్ బస్‌డిపో పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బస్ డిపో ఎదుట ఎర్ర రిబ్బన్లు ధరించి ధర్నా చేపట్టారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఎస్.నారాయణ మాట్లాడుతూ బస్‌డిపో, భోజనగదిలో తాగునీటి వసతి కల్పించాలన్నారు. మునిపెల్లి, నాందేడ్ ఇతర సింగిల్ క్రూ విధుల్లో అనవసరమైన విశ్రాంత సమయం తీసివేయాలని, సరైన ఓటీ ఇవ్వాలని సూచించారు. కార్మికులపై పక్షపాతధోరణి, మహిళా కండక్టర్లపై దురుసు ప్రవర్తనను అరికట్టాలన్నారు. కాలం చెల్లిన టిమ్ యంత్రాల స్థానంలో కొత్తవాటిని తీసుకురావాలన్నారు. శ్రీశైలం బస్సు సర్వీసుకు ఇద్దరు చోదకులకు నియమించాలని, నిబంధనలకు విరుద్ధంగా పెంచిన కిలోమీటర్లను తగ్గించాలని చెప్పారు. డిమాండ్ల పరిష్కారానికి ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఆందోళనలో నాయకులు కె.రమేశ్, డి.ఆర్.స్వామి, పి.పత్తుసింగ్, ఖాలిక్, శేఖర్, రాజేశ్వర్, జలాలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రరసం ఉద్యోగులు

జిల్లాస్థాయి యోగా పోటీలు వాయిదా

కడెం, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న మండలంలోని అంబారిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించాల్సిన నిర్మల్ జిల్లాస్థాయి యోగా పోటీలు వాయిదా వేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శేక్ ఇమ్రాన్ తెలిపారు. 18న పోటీలు నిర్వహించనున్నట్లు ఇదివరకే అధికారులు వెల్లడించారని, అయితే గురువారం నుంచి పాఠశాలల్లో మీజిల్స్, రూబెల్లా టీకాలను వేస్తుండడంతో పాటు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పోటీలను వచ్చేనెల ఆరో తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పోటీలను వాయిదా వేస్తున్నామని అంతా గమనించి సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ పేదరిక నిర్మూలనసంస్థలో (సెర్ప్) పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక పాలనాప్రాంగణం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. మండలస్థాయి ఉద్యోగుల సంక్షేమసంఘం అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీని వర్తింపజేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరుచేయాలని, కనీసవేతనం రూ. 18,500 ప్రతి నెలా సెర్ప్ నుంచి చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగుల విధులను సూచించేలా జాబితా ఏర్పాటుచేయాలని, పని ఒత్తిడిని తగ్గించాలని పేర్కొన్నారు. అటెండర్లకు సైతం కనీసవేతనం, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగులందరికీ ఆరోగ్యభద్రత, బీమా సౌకర్యం కల్పించాలని, ఆరోగ్యకార్డులు జారీచేయాలని సూచించారు. ఈ డిమాండ్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెను కొనసాగించనున్నట్లు చెప్పారు.


సమ్మెలో పాల్గొన్న సెర్ప్ సిబ్బంది